సాక్షి ప్రకాశం

సోమవారం । 22 । జనవరి । 2024



కలసికట్టుగా ముందుకు సాగుదాం

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు కలసికట్టుగా పనిచేయాలని దర్శి నియోజకవర్గ ఇన్చార్జ్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. - 8లో..



యర్రగొండపాలెం

వైఎస్సార్ సీపీ కంచుకోట

యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీకి కంచుకోట అని మరోసారి నిరూపించాలని నియోజకవర్గ ఇన్చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 33/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జంకెను కలిసిన కనిగిరి సమన్వయకర్త



జంకెకు బొకే ఇస్తున్న నారాయణయాదవ్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని ఆయన నివాసంలో కనిగిరి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దద్దనాల నారాయణ యాదవ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

డా.లంకాకు జ్యోతిష విద్వాన్ భూషణ్, బంగారు నంది పురస్కారం



అవార్డు అందుకున్న లంకా ప్రసన్నకుమార్

ఒంగోలు మెట్రో: ఒంగోలు నగరానికి చెందిన ప్రముఖ జ్యోతిష్కుడు డా.లంకా ప్రసన్న కుమార్‌కు టీఎస్ఆర్ ఫౌండేషన్, లిటిల్ ఛాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో జ్యోతిష విద్వాన్ భూషణ్ పురస్కారంతో పాటు బంగారు నంది పురస్కారం అందజేశారు. స్థానిక శర్మ కాలేజీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, డా. ఏ.శ్రీనివాసరావు, అకాడమీ అధ్యక్షుడు డా.కొలకలూరి రవిబాబు అతిథులుగా పాల్గొన్న కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేశారు.

పేదల కల సాకారానికి
వడివడిగా అడుగులు

ఒంగోలు నగరంలో నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి పట్టుబట్టి దానిని సాధించుకున్నారు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి. టీడీపీ నేతలు కోర్టు కేసులతో ఎన్ని అడ్డంకులు సృష్టించినా పట్టువిడవక ప్రైవేటు భూములను కొనుగోలు చేసి మరీ పేదలకు పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తూ జీవో ఇచ్చిన 24 గంటల్లోనే నిధులనూ జమచేసి సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్తశుద్ధిని చాటుకున్నారు. భూములిచ్చిన రైతులకు డబ్బు చెల్లించి పేదలకు పట్టాలిచ్చేలా వడివడిగా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లాకు రానున్న బాలినేనికి ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు సమాయత్తమయ్యారు.

- నగరంలో 24 వేల మందికి పట్టాల పంపిణీకి రంగం సిద్ధం
- జీవో ఇచ్చిన 24 గంటల్లోనే రూ.201.335 కోట్లు విడుదల
- మరో రెండు రోజుల్లో రైతుల ఖాతాలకు జమ కానున్న నగదు
- ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు రేపు నగరానికి వస్తున్న బాలినేని
- ఆయనకు ఘన స్వాగతం పలకనున్న ప్రజలు



వెంగముక్కలపాలెం వద్ద జగనన్న కాలనీకి సేకరించిన పొలాలు

ఒంగోలు: ఒంగోలు నగర పరిధిలోని పేదలకు పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన ప్రైవేటు భూములను కొనుగోలు చేసేందుకు నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేయడమే కాదు... 24 గంటల్లోపే రూ.201.335 కోట్లు జిల్లా కలెక్టర్ ఖాతాకు జమయ్యాయి. దీంతో జీవో జారీకాగానే ఉత్తుత్తి జీవోలు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్న వారికి నోట్లో పచ్చివెలక్కాయ పడినట్లయింది. ఈనెల 17వ తేదీ రాత్రి వేళ జీవో నంబర్ 44 ద్వారా ఒంగోలులోని వెంగముక్కలపాలెం, యరజర్ల, మల్లేశ్వరపురం, నర్సాపురం అగ్రహారాల్లో రైతుల నుంచి సేకరిస్తున్న భూమికి చెల్లించాల్సిన పరిహారం నిధులు విడుదలయ్యాయి. కొప్పోలు సమీపంలోని మల్లేశ్వరపురం, నర్సాపురం అగ్రహారాల పరిధిలోని రైతుల వద్ద నుంచి 209.49 ఎకరాలు, వెంగముక్కలపాలెం, యరజర్ల వద్ద రైతుల నుంచి 220.53 ఎకరాలు సేకరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందుకుగాను రూ.210 కోట్లు అవసరం కాగా దీనిపై జిల్లా యంత్రాంగంతోపాటు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గట్టిగానే పట్టుబట్టారు. మాట తప్పిన నేతగా తాను రాజకీయాల్లో ఉండనని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంటిపట్టాలు ఇచ్చిన తరువాతే మళ్లీ రాజకీయాల్లో పోటీ చేస్తానంటూ స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వంపై నిత్యం అవాకులు, చవాకులు పేల్చే పచ్చ బ్యాచ్ దీనిని ఎద్దేవా చేశారు. డబ్బులు వచ్చేది లేదు... ఇంటి పట్టా ఇచ్చేది లేదంటూ జనంలో విష ప్రచారం మొదలు పెట్టారు. అయితే బాలినేని స్వయంగా విజయవాడలో కూర్చుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడారు. ఇప్పటికే రూ.210 కోట్లలో రూ.30 కోట్లు జిల్లా యంత్రాంగం రైతుల ఖాతాలకు జమచేశారని, మిగిలిన రూ.180 కోట్లు విడుదల చేయాలని కోరారు. అయితే సీఎం మరో అడుగు ముందుకేసి రూ.180 కోట్లతోపాటు ఆ భూములు చదునుచేయడం, భూములకు హద్దురాళ్లు వేయడం, భూముల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, ఆ కాలనీలకు వెళ్లేందుకు లింకు రోడ్ల నిర్మాణం, పైప్‌లైన్, కల్వర్టులు మొత్తం చేపట్టేందుకు అవసరమైన రూ.21.335 కోట్లను కూడా కలిపి మొత్తం రూ.201.335 కోట్లను విడుదల చేస్తూ జీవో జారీ చేశారు.



వెంగముక్కలపాలెంలో భూములు ఇస్తున్నట్లు ఒప్పందం చేసుకుంటున్న రైతులు (ఫైల్)

ఉత్తుత్తి జీవోలంటూ అపహాస్యం:

ఇదిలా ఉంటే జీవో విడుదల కాగానే టీడీపీలో టెన్షన్ ప్రారంభమైంది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో జీవోలు చాలా వస్తుంటాయని, ఎన్నికల ముందు వచ్చిన ఈ జీవోలు కూడా ఉత్తుత్తివే అంటూ వారి అభిమానులను నమ్మించే యత్నం చేశారు. అయితే వారి ఆశలను పటాపంచలు చేస్తూ ఈనెల 18వ తేదీ సాయంత్రం 4 గంటలకే రూ.201 కోట్ల 33 లక్షల 50 వేలు కలెక్టర్ బ్యాంకు ఖాతాకు జమయ్యాయి. ఒక వైపు జీవో విడుదల కావడంతోనే జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టాలంటూ నగర పాలక సంస్థను కలెక్టర్ ఆదేశించడం, ఈ మేరకు పనుల వేగవంతానికి కమిటీని కూడా ప్రతిపాదించారు. దీంతో ఉత్తుత్తి జీవోలంటూ అపహాస్యం చేసిన నేతలకు పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో రెవెన్యూ అధికారులు చర్యలు వేగవంతం చేశారు. రైతులకు సైతం నిధులు జమచేసేందుకు చర్యలు చేపట్టారు. పరిహారం చెల్లించే పొలాలకు సంబంధించి ఏవైనా బ్యాంకుల రుణాలు ఉన్నాయా అనే విషయమై ప్రస్తుతం పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం సోమవారానికి పూర్తి చేసి మంగళవారం రైతుల బ్యాంకు ఖాతాలకు కూడా జమచేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

అడుగడుగునా టీడీపీ అడ్డంకులు:

పెరుగుతున్న నగరంలో ఉండేందుకు పేదలు సొంత జాగా లేక ఎంతో ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలోనే బాలినేని యరజర్ల కొండ వద్ద ప్రభుత్వ స్థలాన్ని చదునుచేయించి పేదలకు పట్టాలు ఇవ్వాలని యత్నిస్తే టీడీపీ నేతలు అది ఇనుప ఖనిజం ఉన్న ప్రాంతం అంటూ కోర్టులో పిటీషన్ దాఖలు చేసి అడ్డుకున్నారు. గతంలో ఇనుప ఖనిజం తవ్వకానికి అనుమతి పొందిన కంపెనీని అడ్డుకుంటూ టీడీపీ నాయకులు ఆ ప్రాంతంలో ఇనుప ఖనిజం వెలికితీయడానికి వీల్లేదంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేసి నానా రచ్చ చేశారు. కానీ తరువాత ఆ ప్రాంతం ఇనుప ఖనిజం భూమి అంటూ పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ కాకుండా కోర్టును ఆశ్రయించడం టీడీపీ రెండు కళ్ల సిద్ధాంతానికి నిదర్శనం. అయితే తాజాగా ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి మరీ పేదలకు ఇళ్ల పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు.



ఒంగోలు నగరంలో బాలినేనికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

బాలినేనికి ఘన స్వాగతం పలకనున్న ప్రజానీకం

దశాబ్దాలుగా సొంతింటి కల నెరవేర్చుకోలేకపోతున్న ప్రజల కోసం రూ.201.335 కోట్లు మంజూరు చేయించిన తరువాత ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒంగోలు రానున్నారు. తమకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన నిధులు సాధించడంతో పాటు పనులు కూడా వేగవంతంగా చేయిస్తుండడంతో పేదలందరికీ ఇళ్లు (జగనన్న కాలనీలు) లలో ఇప్పటికే భరోసా పత్రాలు అందుకున్న ప్రజానీకం నేడు బాలినేనికి ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక కర్నూల్ రోడ్డు బైపాస్ జంక్షన్ వద్ద నుంచి బాలినేనిని పురవీధుల్లో భారీగా స్వాగతించేలా చర్యలు చేపట్టారు.

పశ్చిమాన రాచబాటలు

- పశ్చిమ ప్రకాశం రోడ్లకు మహర్దశ
- రూ.18.89 కోట్లతో రోడ్ల అభివృద్ధి
- హై ఇంపాక్ట్ కింద సీఎం ప్రత్యేక నిధులు విడుదల
- రూ.18.47 కోట్లతో బీటీ రోడ్ల అభివృద్ధి

నాడు...

టీడీపీ ప్రభుత్వంలో రోడ్లు గుంతలుపడి వర్షపునీరు నిలిచి అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేవి. రాత్రిపూట వాహనదారులు ఈ గుంతల్లో పడి క్షతగాత్రులయ్యారు. రోడ్ల మరమ్మతులకు కనీసం రూపాయి కూడా కేటాయించలేదు.

నేడు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాత రోడ్లకు మరమ్మతు చేయడంతోపాటు పలు మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చి ప్రజల అవస్థలను తీర్చారు. కోట్ల రూపాయల నిధులు కేటాయించి మరమ్మతులు చేశారు. గ్రామాల నుంచి పట్టణానికి రోడ్ల కనెక్టివిటీ పెరిగింది.



వేములకోట జేఆర్ కాలనీలో రోడ్డు నాడు..



జేఆర్ కాలనీలో నిర్మించిన సిమెంటు రోడ్డు నేడు



తర్లుపాడు మండలం కేతగుడిపి ఎస్‌సి కాలనీ - బుద్ధపల్లి రోడ్డు



తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డిపల్లి - తుమ్మలచెరువు రోడ్డు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో రోడ్ల రూపురేఖలు మారుతున్నాయి. టీడీపీ హయాంలో గుంతలుపడి మరమ్మతులకు నోచుకోకుండా అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని రోడ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. ఇప్పటికే పలు రోడ్లను పూర్తిచేయగా మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. మరికొన్ని రోడ్లకు ప్రతిపాదనలు పంపారు. హై ఇంపాక్ట్ పథకం కింద గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీల్లో భాగంగా కొన్ని రోడ్లకు నిధులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలకు మొత్తం 10 రోడ్లు మంజూరయ్యాయి. ఇందులో గిద్దలూరులో 2, మార్కాపురంలో 3, యర్రగొండపాలెంలో 5 రోడ్లు మంజూర య్యాయి. మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం మండలంలోని వేములకోట, చింతగుంట్ల మీదుగా హైవేరోడ్డును కలిపే రోడ్డు. బిరుదులనరవ–బొడిచర్ల మధ్య రోడ్డు, కొనకనమిట్ల మండలం మునగపాడు నుంచి కొండాయపాలెం వరకూ తారురోడ్డు మంజూరయ్యాయి. ఇక దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద రూ.2.07 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. హై ఇంపాక్ట్ కింద 55.25 కిలోమీటర్ల పొడవున నూతన రోడ్లు నిర్మిస్తున్నారు.

ఇప్పటికే 3 నియోజకవర్గాల్లో రూ.15.03 కోట్లతో పీఎంజీఎస్‌వై పథకం కింద రోడ్ల నిర్మాణం పూర్తిచేశారు. మార్కాపురం నియోజకవర్గంలో రూ.6.77 కోట్లతో కొనకనమిట్ల నుంచి వయా కాట్రగుంట మీదుగా నాగంపల్లి వరకూ 13 కిలోమీటర్ల రోడ్డు నిర్మించారు. తర్లుపాడు మండలంలోని గోరుగుంతలపాడు వయా సూరేపల్లి మీదుగా చెన్నారెడ్డిపల్లి వరకూ రూ.7.19 కోట్లతో పది కిలోమీటర్ల రోడ్డును పూర్తిచేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో బేస్తవారిపేట నుంచి చట్టిచర్ల, పూసలపాడు వరకూ రూ.4.83 కోట్లతో 7 కిలోమీటర్ల రోడ్డును, సత్యవోలు నుంచి రాచర్ల వయా కాల్వపల్లి మీదుగా రూ.4.20 కోట్లతో 6 కిలోమీటర్ల తారురోడ్డును పూర్తిచేశారు. పొదిలి మండలం ఉన్నగురవాయపాలెం నుంచి క్రిష్టాయపాలెం వరకూ యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలం కోకోనికుంట నుంచి గంజివారిపల్లి వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పీ ముడివేముల వరకూ నిధులు మంజూరు కావడంతో టెండర్లు పిలిచారు.

బీటీ రోడ్లకు మరమ్మతులు:

గిద్దలూరు నియోజకవర్గంలో 7 వర్కులకు రూ.3.94 కోట్లు మంజూరు చేశారు. ఇందులో ప్రధానంగా శంకరాపురం–పెద్ద కందుకూరు మధ్య 17.08 కిలోమీటర్ల పొడవున పూర్తిగా తారురోడ్డు మరమ్మతులు, ఒంగోలు నుంచి నంద్యాల రోడ్డులో పీ మల్లాపురం వరకూ రోడ్ల మరమ్మతులు చేపట్టారు. వీటిలో కొన్ని పూర్తయ్యాయి. మార్కాపురం నియోజకవర్గంలో 15 వర్కులకు గానూ రూ.7.53 కోట్లతో బీటీ రోడ్ల మరమ్మతులు పూర్తి చేశారు. ఇందులో చింతగుంట్ల–ఎల్‌బీఎస్ నగర్, వేములకోట రోడ్డు, తర్లుపాడు –కలుజువ్వలపాడు రోడ్డు ప్రధానంగా ఉన్నాయి. యర్రగొండపాలెంలో 11 వర్కులకు రూ.7 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు. వాటిలో అమానిగుడిపాడు, గుర్రపుశాల, మాచర్ల–శ్రీశైలం రోడ్డు, ముటుకుల–గుట్లపల్లి, కే గొల్లవిడిపి– త్రిపురాంతకం రోడ్లున్నాయి.



వేములకోట బీటీ రోడ్డు



రోడ్ల అభివృద్ధికి నిధులు

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో హై ఇంపాక్ట్, పీఎంజీఎస్‌వై పథకం కింద రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పలు మండలాల్లో రోడ్ల అభివృద్ధికి బీటీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. పలు చోట్ల రోడ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి.

– రమేష్‌బాబు, ఈఈ పంచాయతీ రాజ్, మార్కాపురం.



మా రోడ్లు బాగున్నాయి

ఈ ప్రభుత్వంలో మా మార్కాపురం ప్రాంతంలోని చాలారోడ్లు బాగుపడ్డాయి. కొండేపల్లి వరకూ రోడ్డు చాలా బాగుంది. మా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కూడా రోడ్లు మరమ్మతులు చేయడంతోపాటు కొత్త రోడ్లు వేశారు.

– కె. శివారెడ్డి, కొండేపల్లి



శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం

దేవదేవుని శోభాయాత్ర

- భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర
- రామ నామంతో పులకించిన ఒంగోలు నగరం
- మహిళా భక్తుల కోలాటాలు
- మార్వాడి మహిళల నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: అయోధ్యలో సోమవారం బాలరాముని భవ్య మందిరం ప్రారంభం, బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆదివారం అయోధ్యలో బాలరామునికి 125 దివ్య కలశాలతో అభిషేకం చేశారు. దానికి అనుసంధానంగా ఒంగోలులో నగరంలో ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో 500 మంది మహిళా భక్తులు 125 కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. వేద పురోహితులు రాజేష్ శర్మ, గూడ సాయిరాం వెండి రథంలో రజత ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం గడియారం వారి వీధిలో వెలసిన అనంత కోదండ రామస్వామి మందిరం నుంచి శోభాయాత్ర బయలుదేరి గాంధీ రోడ్డు దక్షిణం బజారు మీదుగా కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం వరకు అత్యంత వైభవంగా జరిగింది. ఈ శోభాయాత్రకి స్థానిక భక్తులు హనుమాన్ చాలీసా, రామభజన చేస్తూ, మహిళా భక్తుల కోలాటాలు, మార్వాడి మహిళల నృత్య ప్రదర్శన, పతంజలి యోగ సభ్యులు గీతా మందిరం వరకు శోభాయాత్ర లో పాల్గొన్నారు. అనంతరం సీతా రామచంద్ర వైభవం నృత్య రూపకం డాక్టర్ పాలూరి కృష్ణ వాసు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు 125 కలశాల జలంతో స్వయంగా ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఎంఆర్ రవి కుమార్ దంపతులు, ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు తాతా బద్రీనాథ్, పతంజలి యోగపీఠ్ రాష్ట్ర అధ్యక్షుడు, బాబా రాందేవ్ శిష్యుడు బాలు, జీ సుబ్బారావు, ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి వెంకట శేషయ్య, మైనంపాటి సాయికుమార్, గడియారం సుబ్బయ్య శర్మ పాల్గొన్నారు.



రామలక్ష్మణ హనుమంత వేషధారణలో చిన్నారులు



సీతారాముల ఉత్సవమూర్తులు



శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



శోభాయాత్ర

విజయంతో తిరిగి రావాలి

కొనకనమిట్ల: ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో నిర్వహించే అండర్ 14 జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు విజయంతో తిరిగి రావాలని జిల్లా స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి కె.వనజ ఆకాంక్షించారు. మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పాఠశాల పీడీ కబడ్డీ కోచ్‌లు యరగొర్ల బాలగురవయ్య, ఎస్.రవీంద్రబాబుల పర్యవేక్షణలో నిర్వహించిన అండర్ 14 రాష్ట్ర స్థాయి కబడ్డీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఏపీ నుంచి పాల్గొనే క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న మెళకువలు పాటించి పోటీల్లో విజయం సాధించి ఏపీకి మంచిపేరు తీసుకురావాలన్నారు. గొట్లగట్టులో జిల్లా, రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు శిక్షణ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కోచ్ బాలగురవయ్య మాట్లాడుతూ 12 రోజుల పాటు దాతల సహకారంతో జెడ్పీ పాఠశాల ఆవరణలో కబడ్డీ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని ప్రకాశం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ కడప, ఎన్‌టీఆర్, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 20 మంది క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన క్రీడా దుస్తులను క్రీడాకారులకు అందజేశారు. ముందుగా స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి వనజ, దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొదిలి తిరుపతయ్య, మాజీ ఎంపీటీసీలు ఉప్పుటూరి పెదవెంకటయ్య, ఉన్నం శ్రీనివాసులు, పీఈటీలు ఎన్ రవీంద్రబాబు, మంత్రునాయక్, అచ్చయ్య, ఉప్పుటూరి శ్రీనివాసులు, టి.ప్రసాద్, శ్రీను, రాజశేఖర్, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, గోరంట్ల నారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో పీఈటీలు, దాతలు

క్లుప్తంగా

పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదని ఆత్మహత్య


అఖిల్(ఫైల్)

ఒంగోలు టౌన్: ప్రేమించిన అమ్మాయి కోసం ఆత్మహత్య చేసుకున్నాడు ఒక యువకుడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... యరజర్ల గ్రామానికి చెందిన చావల అఖిల్ (21) ఇంటర్మీడియెట్ మధ్యలో ఆపేసి ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నాడు. ఇతనికి కొద్ది రోజుల క్రితం జరుగుమల్లి మండలం చతుకుపాడు గ్రామానికి చెందిన యువతితో పరిచయమైంది. అది కాస్త ప్రేమగా మారింది. ఈ క్రమంలో పెళ్లి చేసుకుందామని ఆ యువతిని అడిగాడు. విషయాన్ని యువతి తలిదండ్రులకు చెప్పగా వారు అంగీకరించలేదు. పెళ్లికి తన తలిదండ్రులు అంగీకరించలేదని, నేను అత్మహత్య చేసుకొని చనిపోతున్నానంటూ ఆ యువతి అఖిల్‌కు మెసెజ్ పెట్టింది. మనస్తాపం చెందిన అఖిల్ ఆదివారం ఒంగోలులోని భాగ్యనగర్‌లో ఉంటున్న మిత్రుల వద్దకు వచ్చాడు. మిత్రులు బయటకు వెళ్లినప్పుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. బయట నుంచి వచ్చిన మిత్రులు ఫ్యాన్‌కు వేలాడుతున్న అఖిల్‌ను కిందకు దింపి వెంటే జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అఖిల్ తండ్రి కోటేశ్వరరావు కూలి పనులు చేస్తుంటాడు. తల్లి కుమారి ఒంగోలులోని ఒక మాల్‌లో పని చేస్తుంటారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు జీజీహెచ్ వద్దకు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా పడి నలుగురికి గాయాలు

కంభం: ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి కారు బోల్తా పడి నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలో హైవే రోడ్డుపై ఆదివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం..కర్నూల్ నుంచి వినుకొండకు వెళుతున్న కారు ద్విచక్రవాహనదారుడిని తప్పించబోయిన ప్రమాదవశాత్తు రోడ్డు మార్జిన్ దాటిపొలాల్లోకి దూసుకెళ్లింది.ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు స్వల్పంగా గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కంభం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం..బేస్తవారిపేట మండలం నేకునాంబాద్ వైఎస్సార్ క్లీనిక్‌లో సీహెచ్‌ఓగా పనిచేస్తున్నషేక్.సర్దార్ మార్కాపురం నుంచి కంభం వైపు వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో సర్దార్ ఎడమ కాలు విరిగింది.అనంతరం చికిత్స నిమిత్తం స్థానికులకు వైద్యశాలకు తరలించారు.

కలిసికట్టుగా ముందుకు సాగుదాం


తాళ్లూరులో శివప్రసాదరెడ్డికి స్వాగతం పలుకుతున్న వైస్ ఎంపీపీ దంపతులు, నాయకులు


కొత్తపాలెంలో జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ముఖ్యనేతలతో మాట్లాడుతున్న శివప్రసాదరెడ్డి

- జగనన్నను మళ్లీ సీఎం చేయడమే మనందరి లక్ష్యం
- వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

తాళ్లూరు(ముండ్లమూరు): జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దామని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లూరు, కొత్తపాలెం గ్రామాల్లో ఆయన ఆదివారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా తాళ్లూరులో వైస్ ఎంపీపీ యడమకంటి వెంకటేశ్వరరెడ్డి దంపతులు, నాయకులు బూచేపల్లి శివప్రసాదరెడ్డికి ఘనస్వాగతం పలికారు. తాళ్లూరులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పార్టీని నమ్ముకొని పనిచేసిన వారికి న్యాయం చేస్తానన్నారు. మనందరి లక్ష్యం జగనన్నను మరోసారి సీఎంని చేయడమేనన్నారు. కార్యకర్తకు ఎలాంటి కష్టం వచ్చినా అన్ని వేళలా అందుబాటులో ఉండి ఆదుకుంటానన్నారు. ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. మా కుటుంబానికి తాళ్లూరు మండలంతో విడదీయరాని బంధం ఉందన్నారు. 20 ఏళ్లుగా తాళ్లూరు మండల ప్రజలు బూచేపల్లి కుటుంబంపై చూపిన ప్రేమ, అభిమానాలు మరువలేనివన్నారు. మీ రుణం తీర్చుకునేందుకు, మీకు సేవ చేసేందుకే మరో సారి జగనన్న నాకు అవకాశం కల్పించారని ఆయన నమ్మకాని నిలబెడతానన్నారు. మీలో ఒకడిగా నిలిచి అందరి అండదండలతో అందరిని కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. జగనన్న పాలనలో మనందరి కుటుంబాలు ఆనందంగా ఉన్నాయన్నారు. నాయకులకు, కార్యకర్తలకు ప్రతిక్షణం అందుబాటులో ఉండి సేవచేస్తానన్నారు. అనంతరం కొత్తపాలెంలో ఇటీవల కంటి ఆపరేషన్ చేపించుకున్న జెడ్పీటీసీ మారం వెంకారెడ్డిని పరామర్శించారు. పలువురు ముఖ్యనాయకులు ఎడమకంటి రమణారెడ్డి, దారం పాపిరెడ్డి, కైపు వెంకటేశ్వరరెడ్డిలను కలిశారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మీ అందరి సహకారం, అండదండలతో అందరినీ కలుపుకుపోతానన్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ యిడమకంటి రమాదేవి, సర్పంచ్‌లు మేకల చార్లెస్‌సర్జన్ సుబ్బారావు, వలి, శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభాకరరెడ్డి, నాయకులు పులి ప్రసాదరెడ్డి, కైపు వెంకటేశ్వరరెడ్డి, కోటా కలింగారెడ్డి, కోటా శ్రీనివాసరెడ్డి, మేడగం రమణారెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీ కంచుకోట


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్


ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

పెద్దారవీడు: వైఎస్సాసీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, మరోసారి యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీకి కంచుకోటగా నిరూపించాలని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలో తోకపల్లి పంచాయతీ హనుమాన్‌జంక్షన్ కుంటలో ఆదివారం మండల స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల అత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత హీరోహోండా షోరూం వద్ద ఆయన్ను గజమాల, శాలువాతో సత్కరించి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీగా బయల్దేరి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మార్కాపురం రోడ్డులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టును ప్రారంభించి పశ్చిమ ప్రాంత ప్రజలకు ఫ్లోరిన్ లేకుండా సాగు, తాగునీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయమే ధ్యేయంగా అంత కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం తధ్యమన్నారు. పాలించే పాలకుడు మంచి వాడైతే ప్రకృతి, భగవంతుడు సహకరిస్తారని జగనన్న పాలనలో రుజువైందన్నారు. నేడు జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, సకాలంలో వర్షాలు కురిసి రైతన్న ముఖంలో చిరునవ్వు కనిస్తుందన్నారు. నియోజవర్గంలో తాగునీటి బిల్లులు త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న కాలంలో గ్రామాల్లో సొంత నిధులతో తాగునీటి సమస్య లేకుండా తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పచ్చ పత్రికలలో విషపు రాతలు రాస్తున్నారని కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ఏ రోజైనా రాశారా అని ప్రశ్నించారు. యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక పచ్చ మీడియా విషపు రాతలు రాస్తోందని మండిపడ్డారు. ఏపీ ఇరిగేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ దుగ్గెంపుడి వెంకటరెడ్డి, పెద్దారవీడు, త్రిపురాంతకం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు పోలిరెడ్డి కృష్ణారెడ్డి, శింగారెడ్డి పోలిరెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తోకల ఆవులయ్య, సర్పంచ్ జిల్లెల మల్లేశ్వరి, ఎంపీటీసీ ఉప్పలపాటి భాగ్యరేఖ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా మల్లేష్, నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పోటు రంగయ్య, దుద్దెల వెంకటరెడ్డి, షేక్ బుజ్జి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవసమాజ నిర్మాణానికి
లెనిన్ మార్గమే శరణ్యం


సీపీఎం కార్యాలయంలో లెనిన్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: దేశంలో నవసమాజ నిర్మాణానికి లెనిన్ అనుసరించిన మార్గం ఒక్కటే శరణ్యమని ప్రముఖ అర్థశాస్త్ర నిపుణుడు డి.పాపారావు స్పష్టం చేశారు. లెనిన్ 100వ వర్ధంతి సభ ఆదివారం మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహించారు. సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన సభకు కమ్యూనిజం పత్రిక సంపాదకుడు ఎంసీ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ 107 ఏళ్ల సంవత్సరాల క్రితం మానవ సమాజాన్ని పట్టి పీడీస్తున్న దోపిడీ, రాచరికం, వెట్టిచాకిరి, వలస పాలనలను అంతం చేసి తొలి సోషలిస్ట్ రాజ్యాన్ని స్థాపించిన లెనిన్ యావత్ ప్రపంచానికి స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నాయకులు వెంకయ్య, సర్దార్, పోతినేని వెంకటేశ్వర్లు, లక్ష్మి, వీరారెడ్డి, ఆర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ ఒక శక్తి..

మానవ సమాజంలోని అంతరాలను తరిమికొట్టి సమసమాజాన్ని స్థాపనకు పునాది వేసిన గొప్ప కమ్యూనిస్టు లెనిన్ ఒక వ్యక్తి కాదు శక్తి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పూనాటి ఆంజనేయులు అన్నారు. సుందరయ్య భవన్‌లో జరిగిన లెనిన్ వర్ధంతిలో ఆయన మాట్లాడారు. శ్రామిక వర్గ ప్రజల నెత్తురును పీల్చిపిప్పి చేసే దోపిడీ వర్గ పాలకులకు లెనిన్ పేరు ఒక హెచ్చరిక లాంటిదని చెప్పారు. ప్రజల సంపదను బడాబాబులకు దోచిపెడుతున్న పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించడం ఒకటే లెనిన్‌కు నిజమైన నివాళి అవుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జి.రమేష్, కంకణాల ఆంజనేయులు, జీవీ కొండారెడ్డి పాల్గొన్నారు. లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకొని ప్రజాసాహితి ప్రచురించిన ప్రత్యేక సంచికను జనసాహితి జిల్లా అధ్యక్షుడు జీవీ కృష్ణయ్య ఆవిష్కరించారు. డాక్టర్ శాంతి కుమార్, ప్రసన్న, సత్యనారాయణ, విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


బోల్తాపడిన బోలేరో ట్రక్


నుజ్జు నుజ్జు అయిన కారు ముందుభాగం


మృతిచెందిన వెంకటేశ్వర్లు

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లో ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గుంటూరు నుంచి టమోటా ఖాళీ బాక్సుల లోడుతో గిద్దలూరు వైపునకు బోలేరో ట్రక్ వెళ్తుంది. ఫ్లై ఓవర్ దిగగానే రోడ్డు పక్కన మార్జిన్ నుంచి పెట్రోల్ బంకులోకి వెళ్లేందుకు సడన్‌గా బ్రేక్ వేసి బోలేరో వాహనాన్ని ఎడమ వైపుకు తిప్పాడు. అదే సమయంలో బోలేరో వెనుకనే శ్రీశైలం నుంచి ఒంటిమిట్టకు నల్గురు ప్రయాణికులతో ఇన్నోవా కారు వెళ్తుంది. ఈ క్రమంలో బోలేరో వాహనం నెమ్మదించి పక్కకు తిప్పడంతో వెనుకే ఉన్న ఇన్నోవా వాహనం ఢీకొట్టడంతో బోలేరో వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో బోలేరోలో వెనుక వైపున టమోటా బాక్సుల వద్ద కూర్చున్న బేతంచర్ల మండలానికి చెందిన రైతు చెన్నమ్మగారి వెంకటేశ్వర్లు వాహనంలోంచి ఎగిరి ఫ్లై ఓవర్ సిమెంట్ కాంక్రీట్ దిమ్మెపై పడ్డాడు. తల పగిలి తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించే సమయంలో మార్గమధ్యంలో మృతిచెందాడు. ఎస్సై నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

- మహిళకు స్వల్ప గాయాలు


రవణయ్య మృతదేహం

పొన్నలూరు: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చెన్నిపాడు అడ్డ రోడ్డు సమీపంలో ఓవీ రోడ్డుపై ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కనిగిరి మండలం కంతంవారిపాలెం గ్రామానికి చెందిన ముప్పూరి రవణయ్య(48) కొన్ని రోజులుగా ఆజీస్‌పురం గ్రామంలో నివసిస్తున్నాడు. ఆదివారం బంధువుల కార్యక్రమానికి జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామానికి వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో గుడ్లూరు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన వారు పాలేటి గంగమ్మ గుడిలో పూజలు ముగించుకొని ఆటోలో వస్తుండగా చెన్నిపాడు అడ్డరోడ్డు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొనడంతో బైక్‌పై ఉన్న రవణయ్య కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న మహిళ కూడా స్వల్ప గాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి సాంబశివయ్య తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం


గొబ్బూరులో బ్యారన్‌లోని కాలిపోయిన పొగాకు

పెద్దారవీడు: మండలంలో గొబ్బూరులో రైతు వెన్నా పెద్దవెంకటేశ్వరరెడ్డి పొగాకు బ్యారన్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు వివరాల ప్రకారం..బ్యారన్‌లో క్యూరింగ్ చేస్తుండగా అల్లుడు కర్ర జారి ఇనుప గొట్టంపై పడటంతో నిప్పు రవ్వలు ఎగిసి మంటలు వ్యాపించాయి. బ్యారన్ లోపల నుంచి పొగలు వస్తుండటంతో చుట్టపక్కల వారు గమనించి తలుపు తీసి చూడగా మంటలు చెలరేగాయి. వెంటనే మార్కాపురం అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించగా..సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లింది.

సౌత్ ఇండియా టీ–20 క్రికెట్ విజేత బళ్లారి

- హోరాహోరీగా టీ–20 క్రికెట్ పోటీలు
- శ్రీకాకుళంపై ఒక వికెట్ తేడాతో ఘన విజయం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): సౌత్ ఇండియా టీ–20 క్రికెట్ విజేతగా బళ్లారి జట్టు నిలిచింది. ఆదివారం ఫైనల్‌లో బళ్లారి, శ్రీకాకుళం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్ అసలుసిసలు ఆనందాన్ని ఇచ్చింది. ఫైనల్ మ్యాచ్‌ను చూడటానికి వచ్చిన ప్రేక్షకుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పర్చూరులో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ సారథ్యంలో జాతీయస్థాయి సౌత్ ఇండియా పోటీలు నిర్వహించారు.

ఆదివారం శ్రీకాకుళం జట్టుతో జరిగిన ఫైనల్ పోరులో బళ్లారి ఒక వికెట్ తేడాతో గెలుపొందింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు ఎంచుకున్న శ్రీకాకుళం నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు సాధించింది. జట్టులో ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ 33 బంతుల్లో 42 పరుగులు సాధించాడు. అనంతరం 167 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన బళ్లారి ఆచితూచి ఆడుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించింది. కాని బ్యాటర్ల జోరుకు శ్రీకాకుళం బౌలర్లు కళ్లెం వేశారు. కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ బళ్లారిపై ఒత్తిడి తెచ్చారు. 18 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసి విజయం సాధించింది. (35 బంతుల్లో 54 పరుగులు రెండు ఫోర్లు, ఐదు సిక్సర్‌లు) చేసి జట్టు విజయానికి కారకుడైన శివరాజ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

మూడో స్థానంలో నిలిచిన మార్టూరు జట్టు..

మూడో స్థానం కోసం ఉదయం జరిగిన పోటీలో ఒంగోలుపై మార్టూరు జట్టు నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా శ్రీకాకుళం జట్టుకు చెందిన ఎస్ఎన్వీ ప్రసాద్ ఎంపికయ్యాడు. బెస్ట్ బౌలర్‌గా సీహెచ్ శివ, బెస్ట్ బ్యాటర్‌గా ఎండీ తాహ, బెస్ట్ కీపర్‌గా తుషార్ సింగ్, బెస్ట్ ఫీల్డర్‌గా సాత్విక్ ఎంపికైనట్లు నిర్వాహకులు తులసి శివనాగేశ్వరరావు తెలిపారు. విజేతలకు ఆమంచి కృష్ణమోహన్ వరసగా రూ. 3 లక్షలు, రూ. 2 లక్షలు, రూ.1 లక్ష బహుమతులను అందజేశారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన టోర్నమెంట్‌లో 20 మంది రంజీ ఆటగాళ్లు, ఇద్దరు ఐపీఎల్ ఆటగాళ్లు పాలు పంచుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి అప్పారావు,నీ రుకట్టు వాసుబాబు, కోటా శ్రీనివాసరావు, నూతలపాటి బలరాం, ఉప్పలపాటి అనిల్, రామకృష్ణ, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ మృతి


శింగంశెట్టి రామాంజనేయులు (ఫైల్)

ముండ్లమూరు: మండలంలోని వేముల సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శింగంశెట్టి రామాంజనేయులు (27) వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. దర్శి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన శింగంశెట్టి రామాంజనేయులు వేముల సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల అతనికి వేంపాడు వద్ద ఉన్న అమూల్ డెయిరీ డాట్ సెంటర్‌కి ఇన్‌చార్జిగా నియమించారు. తండ్రి హరిశ్చంద్రతో కలిసి దర్శిలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో శుక్రవారం అస్వస్థతకు గురి కావడంతో కుటుంబసభ్యులు గుంటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతునికి వివాహం కాలేదు. తండ్రి హరిచంద్ర, సోదరుడు, సోదరి ఉన్నారు. రామాంజనేయులు మరణవార్త తెలియగానే వేముల సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నడింపల్లి వెళ్లి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

ఒంగోలు టౌన్: చదువు ఒక్కటే పిల్లలకు బంగారు భవిష్యత్ ఇస్తుందని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. జిల్లా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. నీతి కథలను చదివించి వారికి అందులోని నీతిని అర్థమయ్యేలా బోధించారు. దేశం కోసం భగత్‌సింగ్, అష్ఫాకుల్లా ఖాన్, అల్లూరి సీతారామరాజు తమ జీవితాలను ఎలా అంకితం చేశారో తెలిపారు. స్వాతంత్ర్యానంతరం అప్పటి నాయకులు పాటించిన నైతిక విలువలను చెప్పారు. పిల్లలకు మంచి అలవాట్లను నేర్పించాల్సిన బాధ్యత తలిదండ్రులపై ఉందన్నారు. పుస్తకాలు పిల్లలకు జీవితాన్ని నేర్పుతాయని, మంచి నడవడికను అలవర్చుతాయన్నారు. పుస్తకాలు చదవడం వల్ల మానసిక వికాసం కలుగుతుందని, విజ్ఞానం పెరుగుతుందని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య అన్నారు.